క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

గుత్తిరూరల్: పీ.యర్రగుడి, పెద్దొడి, తురకపల్లి గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిచే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బి.శ్రీనివాస్‌రెడ్డి, మండల పట్టణ కన్వీనర్లు గోవర్ధన్‌రెడ్డి, హుసేన్‌పీరాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

పామిడి: కండ్లపల్లి, రామగిరి గ్రామాలకు గురువారం ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి విచ్చేస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపాయి. ఆయా గ్రామాల్లో నిర్మించిన సచివాలయం, విలేజ్ క్లినిక్, రైతుభరోసా కేంద్రం భవనాలను ప్రారంభిస్తారని, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరాయి.

సమస్యలపై అధికారుల నిలదీత



సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి : ప్రజాసమస్యలపై కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారంమున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు ఫరూక్, బుసా రూపావతి, ఖాజాఖాన్, వరదరాజులు, వాల్మీకి శివ, అరవింద బాబు, వెంకటసుబ్బయ్య, రాజేశ్వరీ, కృపా సుజాత తదితరులు డ్రైనేజీ, తాగునీరు, రోడ్లు, స్ట్రీట్ లైట్లు వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామ కమిషనర్ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మలతారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



తురకపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గుత్తి రూరల్: తురకపల్లి, బేతాపల్లి, అబ్బేదొడ్డి, పెద్దొడ్డి, కరిడికొండ గ్రామాల్లో వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్, కుష్టు నివారణ అధికారి వైద్యం వెంకటేశ్వర్లు బుధవారం కుష్టు పక్షోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కుష్టు లక్షణాలను వివరించారు. వైద్య సిబ్బంది అనుమానితులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్వప్న, సుధారాణి పాల్గొన్నారు.

విద్యలో ఏపీ మొదటి స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తిరూరల్: విద్య అందుబాటులో కేరళ దాటి ఏపీ మొదటి స్థానంలో నిలిచిందని, ఇందుకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థలో తెచ్చిన విప్లవాత్మక మార్పులే కారణమని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీపురంలో నాడు-నేడు కింద పాఠశాలలు అభివృద్ధి, అమ్మవడి పథకంపై ఐటీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, విదేశీ విద్యా దీవెన ఇలా అనేక విప్లవాత్మక మైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఐటీ విభాగం నాయకులు హరినాథ్ రెడ్డి, మహలింగ, పాఠశాల హెచ్‌ఎం సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

శింగనమల: దళిత, గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక ఎస్సీ కాలనీలో పౌర హక్కులపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, గిరిజనుల అభివృద్ధి రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు చేశాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. ఏఎస్‌ఐ చితంబరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ... కుట్రలు ఫలించకపాయె!

- ఎంపీఐ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎంపీఐ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: ఎంపీఐ కార్యాలయం విషయంలో మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కుట్రలు ఫలించలేదు. ఎట్టకేలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కార్యాలయాన్ని ప్రారంభించారు. వివరాల్లోకెళితే..ఎన్నో ఏళ్లుగా మార్కెట్‌యార్డులో తీవ్ర అసౌకర్యాల నడుమ ఎంపీఐ కార్యాలయం పని చేస్తోంది. చిన్న పొడమల పంచాయతీ సర్వే నంబర్ 382 బిలోని ప్రభుత్వ భూమిని ఎంపీఐ నూతన కార్యాలయ నిర్మించాలని 2022లో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పంచాయతీ కూడా తీర్మానం చేసింది. దీంతో గతేడాది దాతల సహకారంతో కార్యాలయ నిర్మాణం చేపట్టారు.

అడుగడుగునా అడ్డంకులు

ఎంపీఐ కార్యాలయ భవన నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచి జేసీ ప్రభాకర్‌రెడ్డి దాన్ని అడ్డుకునేందుకు కుటిలయత్నాలు చేశారు. కార్యాలయ నిర్మాణం పూర్తయితే ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ప్రజల్లో మంచి పేరు వస్తుందని కక్షగట్టారు. ఈక్రమంలో ఎంపీఐ కార్యాలయ పనులను ఆపాలని హైకోర్టులో తాడిపత్రి లారీ అసోసియేషన్ కార్యదర్శి నదీముద్దీన్, పి. రవిమోహన్ ద్వారా వేర్వేరుగా పిల్స్(ప్రజావ్యాజ్యాలు) వేయించారు. అయితే హైకోర్టు ప్రభుత్వ భవన నిర్మాణాలను ఆపలేమని, కేసును ఈ నెల 21కి వాయిదా వేసింది. హైకోర్టు నిర్ణయంతో ఖంగుతున్న జేసీ కాల్వగడ్డ వీధికి చెందిన సైపుద్దీన్ ఎంపీఐ కార్యాలయ నిర్మాణంపై స్టేటస్ కో ఆర్డర్ ఉందని సోషల్ మీడియాలో ప్రచారం చేయించారు. అయితే ఎంపీఐ కార్యాలయ భవన నిర్మాణం సర్వే నంబర్ 382 బిలో కాగా, తన పొలం సర్వే నంబర్ 383-2 లో నిర్మించినట్లు సైపుద్దీన్ స్టేటస్ కో తీసుకురావడం విశేషం.

అధికారుల సర్వేతో మార్గం సుగమం...

రెవెన్యూ, మండల సర్వేయర్లతో పాటు పంచాయతీ అధికారులు రెండు రోజుల క్రితం ఎంపీఐ కార్యాలయం నిర్మించిన భూమి సర్వే నంబర్ 382 బిని కొలతలు వేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే ఎంపీఐ కార్యాలయ నిర్మాణం చేపట్టినట్లు ధృవీకరించారు. దీంతో తాడిపత్రి ఎంపీఐలు శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి బుధవారం ఉదయం ఎమ్మెల్యే చేత నూతన ఎంపీఐ కార్యాలయ భవనాన్ని ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో వాల్మీకీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రాజు, దాతలు, కాంట్రాక్టర్, వైఎస్సార్సీపీ నాయకులు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి, ఆలూరు రామేశ్వరరెడ్డి, గురుశంకర్, పుట్లూరు భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, థామస్, అశోక్, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభ విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, సమన్వయకర్త వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం: ఈనెల 10న అనంతపురంలో వైఎస్సార్‌సీపీ నిర్వహించే సిద్ధం సభను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు పేర్కొన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో సిద్ధం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సత్తా భీమిలి సభతో రాష్ట్రమంతా తెలిసిందన్నారు. ఇప్పుడు మన అనంతపురంలో నిర్వహిస్తున్న సిద్ధం సభకు మనమంతా సన్నద్ధం కావాలన్నారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు అందుబాటులో ఉండాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, నాయకులు కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, పూల నారాయణస్వామి, ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, ముసలన్న, నారాయణ, లక్ష్మిరెడ్డి, నాగ, కొండన్న, నందినేని మల్లికార్జున, అనంత వెంకటరెడ్డి, చేపల రమణ, పురుషోత్తం, బూసీ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలపై దాడులు

గుత్తి: పట్టణంలోని బేకరీలు, కూల్‌డ్రింక్ దుకాణాలపై తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ బుధవారం ఆకస్మిక దాడులు చేశారు. గుత్తి బస్టాండులోని 3,5 షాపుల్లో వాటర్ బాటిళ్లు, శీతల పానీయాలు ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తుండటంతో యజమానులపై కేసు నమోదు చేశారు. 3వ షాపునకు రూ.10 వేలు, 5వ షాపునకు రూ5 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వ్యవసాయంపై అవగాహన అవసరం



వివరాలను తెలుసుకుంటున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువులతో పాటు వ్యవసాయంపై అవగాహన అవసరమని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. గురువారం శింగనమల మండలం ఈస్ట్ నరసాపురంలో బద్వేల్ ఎస్‌బీవీఆర్ అగ్రికల్చర్ కళాశాల విద్యార్థులకు 3 నెలల పాటు శిక్షణలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయరంగంలో అనేక విషయాలపై పరిశోధన చేసి వాటి ఫలితాలను రైతులకు అందించాలన్నారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో కే వీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మాధవి, డాక్టర్ కిశోర్ కుమార్‌రెడ్డి, చందన, ఎస్‌బీవీఆర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ లక్ష్మిదేవి, గోపాల్, ఆర్ఏడబ్ల్యూఈపీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: సోదనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం వరి సాగుపై క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఈసందర్భంగా ఉపాధ్యాయురాలు ముబీనా విద్యార్థులకు వరినాటు, కలుపుతీత, సస్య రక్షణ చర్యలను విద్యార్థులకు వివరించారు.

సంక్షేమం, అభివృద్ధే అజెండా



రామరాజుపల్లిలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వైవీఆర్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



దేవునిఉప్పలపాడులో ప్రభుత్వ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



బీకేఎస్ మండలం గోవిందపల్లిలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పామిడి: సంక్షేమ, అభివృద్ధే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం రామరాజుపల్లి, పొళ్యం గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయలేనన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో సీఎం జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రచార ఆర్భాటం తప్పా అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. సీఎం జగన్ తన ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నేరవేర్చారన్నారు. సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారం అయిందన్నారు. ప్రజా ఆరోగ్యం కోసం డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, రైతుల సంక్షేమం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత మా ప్రభుత్వానిదన్నారు. మోసపూరిత సూపర్ సిక్స్ హామీల అబద్ధాల కోరు చంద్రబాబు, ఆయనకు వంతపాడుతున్న జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు ప్రజలు బుద్ధి చెప్పేరోజులు దగ్గరపడ్డాయన్నారు. చెప్పినది చేసి చూపించిన చేతల ప్రభుత్వం తమదన్నారు. రామరాజ్యాన్ని తలపిస్తున్న సీఎం జగన్ పాలన కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశ్వీరదించాలని కోరారు. అంతకుముందు రామరాజుపల్లిలో రూ.88 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్బీకే భవనాను ప్రారంభించారు. అనంతరం పొళ్యంలో రూ.3.12 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్, సచివాలయం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య, సింగిల్‌విండో మాజీ ప్రెసిడెంట్ చుక్కలూరు రామకృష్ణారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ లీలా బాయి, సర్పంచ్‌లు డీసీ ముత్యాల్‌రెడ్డి, మహేశ్వరి, రామాంజనేయులు, పెమ్మక చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేష్‌నాయక్, నారాయణస్వామి, నక్కా ఓబులేసు, శీనా, నాగేశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, బయపరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, ఏఈ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో గ్రామ స్వరాజ్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి టౌన్: సచివాయల వ్యవస్థ ఏర్పాటుతో గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. గ్రామాల్లోనే సచివాలయాలు నిర్మించి గ్రామస్థాయి నుంచే పాలన సాగిస్తున్నారన్నారు. పెద్దపప్పూరు మండలం దేవునిఉప్పలపాడు, చెర్లోపల్లి గ్రామాల్లో బుధవారం సచివాలయం, విలేజ్ హెల్త్‌క్లినిక్, ఆర్‌బీకే నూతన భవనాలను ప్రారంభించారు. ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటి ముంగిటకే పాలన తెచ్చారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ సామాజిక విప్లవం తీసుకొచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమాదేవి సర్పంచ్‌లు కాటయ్య, రామేశ్వరరెడ్డి, ఎంపీపీ బొందలదిన్నె రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రామూర్తిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, నాయకులు రాంబాబు, విశ్వనాథరెడ్డి, కేశవరెడ్డి, సురేంద్రరెడ్డి, నాగరాజు, భూపాల్, చంద్ర, రాఘవేంద్ర, లచ్చి, రామదాసురెడ్డి, రామక్రిష్టారెడ్డి, దేరంగులు రవి, ఆది, నరేంద్ర, అమర్‌నాథరెడ్డి, శివ, సురేష్, పెద్ద రామిరెడ్డి, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పప్పూరమ్మఆలయ నిర్మాణానికి భూమిపూజ

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలం చిన్నపప్పూరులో పప్పూరమ్మ ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భూమి పూజ నిర్వహించారు. దాదాపు రూ.1.25 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తీ చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

రైతులకు ప్రభుత్వానికి వారధులు ఆర్బీకేలు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: రైతులకు ప్రభుత్వానికి రైతు భరోసా కేంద్రాలే వారధులని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం గోవిందపల్లి, రెడ్డిపల్లిలో రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభించారు. ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశ పెట్టి గ్రామాల్లోనే అన్నిరకాల ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగే అవసరం లేకుండానే స్థానికంగానే సచివాలయాల్లో పనులు జరిగేలా చూస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందించేలా చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు రాములమ్మ, నరసమ్మ, వైస్ ఎంపీపీ జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్, ఎంపీడీఓ తేజోత్స్న, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, ఎంపీటీసీ ఎర్రినాగప్ప, యూత్ మండల కన్వీనర్ పూల రంగా, ఎస్టీ సెల్ కన్వీనర్ సాకే లక్ష్మీనారాయణ, నాయకులు రామచంద్రారెడ్డి, రాజు, నాగరాజు, జయరామిరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

సెంట్రల్ జైలు వద్ద అనంతపురం తాడిపత్రి రహదారి నుంచి సెంట్రల్ యూనివర్శిటీ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.4.40 కోట్లతో సెంట్రల్ యూనివర్శిటీ వరకు తారురోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పేదలకు జగనన్న అండ

నార్పల: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ వారికి అండగా నిలిచారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. బుధవారం చామలూరు, సిద్దరాచెర్ల వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, బొందలవాడలోని గ్రామ సచివాలయంతో పాటు వైఎస్సార్ విలేజ్ క్లినిక్, మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కష్టాలను తెలుసుకున్న జగనన్న వారి సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా గ్రామాల్లోని ప్రజలు పట్టణాలకు వెళ్లకుండా సొంత ఊళ్లలోనే మెరుగైన వైద్యం అందుతోందన్నారు. సచివాలయాల ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచులు స్వప్న, రామాంజినేయులు, ఎంపీటీసీలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, కో ఆప్షన్ షాబీరా, నాయకులు నాగలింగారెడ్డి, రంగయ్య, రాజుకుళ్లాయప్ప, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: బసినేపల్లి తండా శివారులో బైక్‌ను బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బసినేపల్లి తండాకు చెందిన విష్ణునాయక్ పని నిమిత్తం బైక్‌పై గుత్తికి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా పత్తికొండ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం ఆచూకీ లభ్యం

గుంతకల్లు రూరల్: గొల్లలదొడ్డి సమీపంలో మంగళవారం మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ సురేష్ బుధవారం తెలిపారు. మృతుడు గుత్తిలోని చెర్లోపల్లి కాలనీకి చెందిన విజయ్‌కుమార్ (53)గా గుర్తించామన్నారు. ఇతడు గుజరీ సామగ్రి, పేపర్లు సేకరిస్తూ గ్రామాల్లో సంచరించేవాడన్నారు. మద్యం మత్తులో కాలువలో కాలుజారి పడి మృతి చెందినట్లుగా విచారణలో తేలిందన్నారు. మృతుడి భార్య సాకే నల్లక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పరిశ్రమల పరిశీలన

పామిడి: స్థానిక టీసీ హైస్కూల్ 9,10 వతరగతి విద్యార్థులు బుధవారం పరిశ్రమల పరిశీలన చేపట్టారు. ఈసందర్భంగా వారు స్థానిక వాటర్‌ప్లాంట్‌ను సందర్శించారు. వాటర్ ప్లాంట్ పనితీరును నిర్వాహకుడు మారుతి వివరించారు. స్కూల్ హెచ్‌ఎం కే రామ్‌కుమార్, ఉపాధ్యాయులు సత్యం, రంగప్ప, మల్లికార్జున, ఇమ్రాన్ అలీ, నరేష్, ఆంథోని, రాధాకృష్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయండి

గుంతకల్లు: ప్రతి విద్యార్థి లక్ష్య సాధనకు కృషి చేయాలని చైతన్య గ్రూప్ కాలేజెస్ చైర్మన్ డాక్టర్ పయ్యావుల రాధాకృష్ణ సూచించారు. స్థానిక శ్రీ శంకరనందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల 40వ వార్షికోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ గోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయనతోపాటు కరస్పాండెంట్ కేసీ హరి మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థానాలకు ఎదగాలని కోరారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు డాక్టర్ రామకృష్ణ నాయుడు, డీపీ మురళీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు సురేష్, అధ్యాపకులు కే.వెంకటేశ్వర్లు, బసెట్టి క్రిష్ణయ్య, డాక్టర్ గోపీ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అశ్వత్థంలో వేలం

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలం అశ్వత్థనారాయణస్వామి క్షేత్రంలో బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా తలనీలాలు, కొబ్బరి చిప్పలు సేకరణ, టెంకాయల విక్రయంపై వేలం పాట నిర్వహించారు. టెంకాయల విక్రయాన్ని యాడికికి చెందిన ధృవనారాయణ 8 లక్షలకు, తలనీలాలు పోగు చేసుకొనుటకు చాగలమర్రికి చెందిన సరోజమ్మ 11.10 లక్షలకు, టెంకాయచిప్పలు పొగు చేసుకొనుటకు సుంకేసులపల్లికి చెందిన గంగ చంద్రారెడ్డి రూ.45 వేలకు దక్కించుకున్నారు. ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పరమ సంస్థానంలో ప్రత్యేక పూజలు

బుక్కరాయసముద్రం: సంజీవపురంలోని పరమ సంస్థానంలో పరమపిత వెంకట రమణాచార్య 12వ ఆరాధనను పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి యోగి ముక్తేశ్వరి ఆధ్వర్యంలో 109 దంపతులతో మహాయజ్ఞం చేపట్టారు. లోక కల్యాణార్థం, సకల జనులు, ప్రాణులు క్షేమంగా ఉండాలని యజ్ఞం నిర్వహిస్తున్నామని యోగి ముక్తేశ్వరి తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఎంపీపీ సునీత పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెబుదాం



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి బుద్ధి చెబుదామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పట్టణంలోని వడ్లపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అటుగా వెళ్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలు తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నది అన్నారు. ఇలాంటి ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూసి ఉండరని తెలిపారు. జేసీ సోదరుల హయాంలో తాడిపత్రిని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని, కేవలం వారి కమీషన్ల కోసం పనులు చేపట్టారే తప్ప ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. దాదాపు 57 నెలల వైఎస్సార్‌సీపీ పాలనలో తాడిపత్రిని అభివృద్ధి దిశగా పరుగులు పెట్టించామన్నారు. 40 ఏళ్లలో జేసీ సోదరులు చేయలేని పనులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తాను చేయగలిగానన్నారు. అలాంటి ప్రభుత్వాన్ని మరొక్కమారు ఆశీర్వదించాలని, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ జబ్బార్ బాషా, నాయకులు జాన్సన్, నరసింహారెడ్డి, రంగనాథరెడ్డి, లక్ష్మిరంగయ్య, అయూబ్ భాష, మనోజ్ కాశీ, రియాజ్, పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా

పెద్దవడుగూరు : మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆయన దిమ్మగుడి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గొడవలకు పాల్పడినా కక్షలు పెంచడానికి కుట్రలు చేసినా సహించబోమని హెచ్చరించారు. ఎలాంటి సమస్య వచ్చిన పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

3న కోటంకలో వేలం

గార్లదిన్నె: గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మాఘ మాసంలో టెంకాయల విక్రయం, తలనీలాల సేకరణకు ఈనెల 3న వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ బాబు బుధవారం తెలిపారు. కోటంక గ్రామంలోని ఎల్లమ్మ కట్ట వద్ద వేలం నిర్వహిస్తామన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం



గుంతకల్లులో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరామయ్య

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష అనే విప్లవాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ కమిషనర్ పి.వెంకటరామయ్య తెలిపారు. బుధవారం పట్టణంలోని ఎస్‌ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్(ఎస్.ఎస్.పేట) మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సజీవ్, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రామాంజినేయులు, ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ ఆస్మాపర్వీన్, కంటివైద్యనిపుణులు సుమారు 526 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. క్యాంప్‌ను పరిశీలించిన కమిషనర్ హెల్త్‌రిపోర్టులు, మందులను అందజేశారు. కౌన్సిలర్ మోహరున్నీసా, వార్డు ఇన్‌చార్జ్ మస్తాన్, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి: 3వ సచివాలయంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. చైర్‌పర్సన్ వన్నూర్ బీ, కమిషనర్ జి. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందన్నారు. వైద్యాధికారులు బిందు భార్గవి, కృష్ణ ప్రసాద్, వరప్రసాద్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేశారు. కౌన్సిలర్ రాజేశ్వరీ మేనేజర్ మురళీధర్, బిల్ కలెక్టర్ చంద్ర శేఖర్,3వ సచివాలయం నోడల్ ఆఫీసర్ షెక్షావలి, మెప్మా అధికారులు కెరెన్, సుమనదుర్గ, సురేఖ, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.